వేణుగోపాలస్వామికి శతకలశాభిషేకం



స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరే వుల గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవా లయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతు న్నాయి. బ్రహ్మోత్సవాలలో బాగంగా శుక్ర వారం ఉదయం స్వామి వారి మూలవిరాట్టు, ఉత్సవ విగ్రహాలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. కలశాలలో సుగంధ ద్రవ్యాలను ఉంచి వేద మంత్రాలతో పూజలు నిర్వహించిన అనంతరం వాటిల్లోని నీటితో అభిషేకం చేశారు. సాయంత్రం గరుడ వాహ నంపై స్వామి వారిని ఊరేగించారు. అనం తరం ఎదురుకోళ్లు నిర్వహించి రాత్రికి స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో శనివారం ఉదయం సహస్ర పుష్పార్చన, ఉంజల్ సేవ, సాయంత్రం శేషవాహన సేవ, రథోత్సవం ఉం టాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజ యవంతం చేయాలని అర్చకులు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్...

ఫిలింనగర్: అధికారులు సీసీ రోడ్ల నిర్మాణ పనులు నెలల తరబడి చేయవద్దని త్వరితగ తిన పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని జూబ్లీహిల్స్ డివి జన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని జ్ఞాని జైల్ సింగ్‌నగర్ బస్తీలో ' 19.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ఏఈ వెంకటేష్, స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. స్థానికులు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సీసీ రోడ్డు కావాలని అడుగుతున్నారని ఉన్నతాధి కారులను కలిసి తాను నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుదారుల నుంచి ధ్రువపత్రాల సేకరణ



ధ్రువపత్రాలను తీసుకుంటున్న సిబ్బంది

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యో గుల నుంచి అధికారులు సంబంధిత ధ్రువీక రణ పత్రాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూ ర్‌లోని వార్డు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా దస్తావేజులను తీసుకుంటున్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గం టల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటు న్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి సిబ్బం ది ఫోన్‌లు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వివరాలను మరోసారి సమర్పించాలని కోరు తున్నారు. కుల, బ్యాంక్ బుక్, ఫొటో, ఆధార్ తదితర ధ్రువపత్రాలను దరఖాస్తుదారులు అందజేస్తున్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న సతీష్

శంషాబాద్ రూరల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మండలం లోని నర్కూడలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం డీసీసీబీ డైరెక్టర్ బి.సతీష్ రూ. 25 వేల చెక్కును శుక్రవారం ఇన్‌స్పెక్టర్‌కు అందజే శారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడు తూ... గ్రామాల్లో గృహస్తులు, వ్యాపారస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నివారణతో పాటు నింది తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు దోహద పడుతాయని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లు.. ప్రమాద ఘంటికలు!



రామంజాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- తక్కువ ఎత్తులో ఉంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- కంచె లేనందున ఆందోళనలో స్థానికులు
- జాగ్రత్త చర్యలు చేపట్టాలని డిమాండ్

శంషాబాద్ రూరల్: జనావాసాలు, పొలాల్లో కం చెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో ఉండటంతోపాటు రక్షణగా కంచె లేకపోవడంతో స్థానికులు ఆం దోళన చెందుతున్నారు.

☛ రామంజాపూర్, తండా, బోటిగూడ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొ న్నాయి. ఏళ్ల నుంచి సమస్య ఇలాగే ఉన్నా అధికా రులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారి పక్కనే...

రామంజాపూర్‌లో తండాకు వెళ్లే మార్గంలో ఓవర్ హెడ్ ట్యాంకు, సంపు నిర్మించారు. ఇక్కడ ఉన్న ఫిరంగా కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టును ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. రోడ్డును ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చిన్నపిల్లలకు చేతికి అందే ఎత్తులో ఉండటంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. చుట్టూ కంచె, ప్రమాద హెచ్చరికలు కానీ కనీస జాగ్రతలు కూడా తీసుకో వడంలేదని మండి పడుతున్నారు. ఆయా గ్రామాల్లో సైతం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిస్థితి ఇలాగే నెలకొంది.

ఏబీ స్విచ్‌ల తొలగింపుతో...

రామంజాపూర్ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని సుమారు ఏడు ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లను ఏళ్ల కిందట తొలగించారు. మరమ్మతులు చేపట్టక



కొన్ని చోట్ల, వివిధ కారణాలతో మరి కొన్ని చోట్ల వీటిని తీసివేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడైనా చిన్న సమస్య వచ్చినా.. కరెంటు సరఫరా ఆగిపోయినా మరమ్మ తుల కోసం ఏకంగా ఈ ప్రాంతం ఫీడర్ కరెం టును సబ్‌స్టేషన్ వద్ద నిలిపివేయాల్సి వస్తుంది. ఇందు కోసం ఏఈ స్థాయి అధికారి అనుమతి, సకాలంలో సిబ్బంది వస్తేనే మరమ్మతు పనులు, సమస్య పరిష్కారం జరుగుతుంది. తాగునీటి బోర్లకు కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉత్పన్నమైతే పరిష్కారం కోసం రోజుల కొద్ది సమయం పడుతుంది. దీంతో నీటి సరఫ రాకు అంతరాయం కలుగుతోంది. కరెంటు తీగలు తెగిపడినా.. గాలి వీచి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోతే.. మరమ్మతుల కోసం ఫీడర్‌కు విద్యుత్ సర ఫరా నిలిపి వేయాల్సి వస్తుంది. దీంతో ఫీడర్ పరిధిలో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పరిష్కార చర్యలు

రామంజాపూర్ పరిధిలో తక్కువ ఎత్తులు ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెల ఎత్తును పెంచ డానికి చర్యలు చేపట్టాం. అనుమతులు వచ్చాయి. పనులను త్వరగా ప్రారంభిస్తాం. మల్కా రం సబ్‌స్టేషన్ నుంచి రామంజాపూర్ ఫీడర్‌కు కరెంటు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మూడు చోట్ల కటాఫ్ పాయింట్లు ఏర్పాటు చేయ డానికి అనుమతులు తీసుకున్నాం. ఈ ఫీడర్ లైన్‌పై భారం పెరిగినందును కొత్తగా మరో లైను ఏర్పాటు చేస్తున్నాం. మిగతా సమస్యల పరి ష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నాం.

– సురేష్‌రెడ్డి, ఏఈ, పెద్దషాపూర్

రోడ్లను శుభ్రంగా ఉంచాలి

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ రోడ్లను శుభ్రంగా ఉంచాలని బండ్ల గూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. 7వ డివిజన్‌లోని సన్‌సిటీ, 15వ డివిజన్‌లోని రఘు రాంనగర్ కాలనీలలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. అలాగే పీరంచెరువు ప్రధాన రహదారిపై వర్షానికి కొట్టుకొచ్చిన చెత్తను తీస్తున్న స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలలో వేయవద్దు అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగ స్వామ్యం ఎంతో అవసరమన్నారు. పారిశుద్ధ్య



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. పనులు చేసే సమయంలో మాస్క్, షూ, రిఫ్లెక్టింగ్ జాకెట్ వేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో శానిటరీ జవాన్లు వెంకటేష్, లక్ష్మీ నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

అత్తాపూర్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాజేంద్రనగర్ మండల ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. ఐదు రోజుల పాటు అత్తాపూర్ ఎడిపై పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సంద ర్భంగా 14 మంది ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ... శిక్ష ణలోని అంశాలను పాఠశాల స్థాయికి తీసుకెళ్లి ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఆర్‌పీలు శిక్షణకు సంబంధించిన అంశాలను చక్కగా వివరించినందుకు ఆయన అభినందించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

రోడ్డుపై కూర్చుని బీఆర్‌ఎస్ నాయకురాలి నిరసన



రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం

మణికొండ: గుంతల మయంగా మారిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు అదే రోడ్డుపై కూర్చుని నిరసన తెలి పారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాం కోహిల్స్ సర్కిల్ నుంచి అంజలిగార్డన్‌కు ఉన్న రోడ్డు గతంలో ఓ నిర్మాణ సంస్థకు డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేశారు. సదరు నిర్మాణ సంస్థ సరైన పద్ధతిలో మరమ్మతులు చేయ కపోవటంతో అక్కడక్కడ కుంగిపోయి అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చి రోడ్డును మరమ్మతు చేయాలని అనేక సార్లు మున్సి పాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో వటం లేదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాల సుమన శిని శుక్రవారం అదే రోడ్డుపై కూర్చుని నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అం జలిగార్డన్ రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. అనేక మంది మహిళలు కింద పడి గాయాల పాల వుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేద న్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, లేదంటే వర్షాకాలంలో మరిన్ని ప్రమా దాలు జరిగే అవకాశం ఉందన్నారు.

వ్యక్తి అదృశ్యం



మొగులయ్య

రాజేంద్రనగర్: కూలీ పని కోసం వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రన గర్ పోలీస్‌స్టేషన్ పరి ధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ కాళీ మందిర్ సాయిబా బా కాలనీ ప్రాంతానికి చెందిన మొగుల య్య(45) దినసరి కూలీ. కూలీ పని చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం పనికి వెళుతున్నానని ఇంట్లో తెలిపి వెళ్లిన మొగులయ్య అనంతరం తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహి తుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడం తో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి

బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మురుగునీటి కాలువలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని, రోజూ రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శుక్ర వారం పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బాగంగా టౌన్‌షిప్‌లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అధికారులకు ఇష్టారాజ్యంగా పన్నుల పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రజలకు అవసరమైన పనులు చేయటంపై లేదని విమర్శించారు. ఇంటి నిర్మా ణాలు చేసే వారు మిగులు పదార్థాలను రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారని, దాంతో చెత్తా, చెదారం పేరుకుపోతుందని, దాన్ని తరలించే యం త్రాంగాన్ని మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని రోడ్లలో వీధి దీపాలు వెలగటం లేదని, రోడ్ల పక్కన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నాయకులు ఉపేంద్ర నాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, షేక్ ఆరీఫ్ అహ్మద్, శ్రీధర్, సుమ నళిని, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాకు చెక్

మణికొండ: పైప్‌లైన్ వాల్వ్ వద్ద అయిన నీటి లీకే జీని జలమండలి అధికారులు అరికట్టారు. మణి కొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, రోడ్డు నెంబర్ 16 వద్ద వాల్వ్ నుంచి నీరు వృ థాగా పోయింది. ఆ విషయాన్ని 'సాక్షి' దినపత్రి కలో శుక్రవారం 'నీటి వృథాను అరికట్టండి' అనే శీర్షికన కథనం ప్రచురించటంతో జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి వెంటనే స్పందించారు. వెంటనే తమ సిబ్బందిని పంపి మరమ్మత్తులు చేయించి లీకేజీని అరికట్టించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గతంలో మెఘా ఇంజ నీరింగ్ వాళ్లు చేసిన పనుల్లో బాగంగా వాల్వ్‌ను ఎత్తులో ఏర్పాటు చేశారన్నారు. దానికి లీకేజీలు



నీటి లీకేజీలను సరిచేస్తున్న సిబ్బంది

ఏర్పడటంతో విషయం తెలుసుకుని మరమ్మ తులు చేపట్టామన్నారు. నీటి సమస్యలను సకాలంలో స్పందించి తీరుస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరి ధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. దుర్గాన గర్, కాటేదాన్ ఫీడర్–2 ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దుర్గానగర్, దుర్గాహిల్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి దేవాలయం , మైలార్‌దేవ్‌పల్లి కల్లు కంపౌండ్, శాంతినగర్, గణేష్ నగర్, స్వప్న థియేటర్, విశ్వకర్మ ఇంజనీరింగ్, బ్యాటరీ కంపెనీ, బసాప్ప హోటల్, హనుమాన్ దేవాలయం, మినార్ హోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గం టల వరకు అయాషా కాలనీ, అలీనగర్, అహ్మద్ నగర్, కింగ్స్ అవెన్యూ, యూసుఫ్ గుల్షన్ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు. రహమత్ కాలనీ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ, వాదే ఈ ఫర్హాన్, మహేశ్వరి ఆయిల్ మిల్, లింక్ సిటీ, అబ్దుల్లా కాలనీ ఫీడర్‌లో 3 గంటల నుంచి 5 గంటల వరకు అబ్దుల్లా కాలనీ, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో...

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరి ధిలోని 11కేవీ ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు తెలి పారు. నేషనల్ పోలీస్ అకా డమీ కాలనీ, వీకర్ సెక్షన్ కాల నీ, శివరాంపల్లి గవర్నమెంట్ స్కూల్ ప్రాంతా లు, హసన్ నగర్, శివరాంపల్లి పాత గ్రా మం, బాబానగర్, హసన్‌నగర్, ఫహాడీ, ఎన్టీఆర్‌నగర్, అక్బర్ హిల్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. శ్రీదేవి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, యూనివర్సిటీ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.



మణికొండ పరిధిలో...

మణికొండ: మణికొండ పరిధిలోని పలు ఫీడర్ల పరి ధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయను న్నట్లు మణికొండ మున్సిపల్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13, కూలీకుదు బ్‌సాక్ కాలనీ, పెంటయ్య కాలనీ, స్కైలా అపార్ట్ మెంట్స్, వినాయక నగర్ ఫేజ్–2 ప్రాంతాలు, హను మాన్‌నగర్, శివపురి కాలనీ, ప్లెజెంట్ వ్యాలీ, శ్రీనివా సనగర్, హాల్‌మార్క్ విల్లాస్, ఎస్‌ఆర్ డీజీ స్కూల్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు పంచవటి కాలనీ, 10 నుం చి 10.30గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 1,2, సెక్టార్ 2ఎ, బి, సి, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్, కాశీవి శ్వేశ్వరాలయం, తిరుమలహిల్స్, డాలర్ హిల్స్, ఖిజ్రాకాలనీ, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోగ్రీన్ కాలనీ, తుల్జారాం దేవాలయం వెనుక, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెం బర్16, 23 నుంచి 30 వరకు, సెక్టార్–4 ప్రాంతా లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు హను మాన్‌నగర్, నాగేశ్వర్‌రావు లేఅవుట్, ఎంప్లాయీస్ కాలనీ, శ్రీహోమ్స్, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు సాయి గౌతమి కాలనీ, మాతృశ్రీ కాలనీ, బీఆర్‌సీ, సాయిచంద్ర కాలనీ, వినాయక్‌న గర్ ఫేజ్–1, అంజలిగార్డెన్, ఎల్ఐసీ కాలనీ, సం తోష్‌నగర్ కాలనీ, న్యూ లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతా లలో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

నార్సింగి పరిధిలో...

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, నార్సింగి మార్కెట్, ఇబ్రహీంబాగ్ సబ్‌స్టే షన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నామని ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు మణికొండ మున్సిపా లిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, పయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి గ్రామం, నార్సిం గి హైట్స్, క్యూబా కాలనీ, క్వాసా కాలనీ, వివేకానం దనగర్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు మణికొం డ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ, వెంక టేశ్వరకాలనీ, పాషకాలనీ, అలీజాపూర్, ఈవీవీ కాలనీ, ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉం డదన్నారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు ఇబ్రహీంబాగ్, నార్సింగి రోడ్డు, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు కోకాపేట 250 గజాల కాలనీ, గోల్డన్‌మైల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్నా టెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్ ప్రాంతా లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలకు | అనుగుణంగా నాణ్యమైన విద్య



హైదర్‌గూడలో బడిఈడు పిల్లలను గుర్తిస్తున్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నిర్మలాజ్యోతి

అత్తాపూర్: విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి అం దుకు అనుగుణంగా వారికి నాణ్యమైన విద్యను అం దిస్తామని హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి, ఉపాధ్యా యుడు భాస్కర్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్ర మంలో భాగం శుక్రవారం శివానగర్, నేతాజీ సుభా ష్‌చంద్రబోస్ స్టాచ్యూ, జనప్రియ తదితర ప్రాంతా లలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఇంటింటా ఉపాధ్యాయుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విశ్లేషత్మక మైన విద్యను అందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దుతున్నామని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 80 వేలను ఖర్చు చేస్తు న్నదన్నారు. ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుం డా ప్రభుత్వ బడుల్లో సుశిక్షితులైన.. అన్ని విధాలా అర్హత ఉన్న ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధన జరుగుతుందన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాతృభాషలో కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే బోధన జరుగుతుంద న్నారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకొని నెల రోజుల పాటు విద్యార్థుల సామర్థ్యాన్ని చూసి ఆ తరువాత మీ ఆలోచనకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అధికారం మీకే ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ మేరకు ఆలోచన చేయాలని స్థానిక యువకులు, ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు సాధించాలని కోరారు. హైదర్‌గూడ ప్రైమరీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 158 మంది విద్యార్థులు ఉన్నార న్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, విద్యార్థులు ఆడుకునేందుకు విశాలమైన క్రీడామై దానం ఉన్నాయన్నారు.

కళాకారులకు అభినందన



కళాకారులను అభినందించిన నరేందర్ తదితరులు

మణికొండ: కూచిపూడి, భరతనాట్యం లాంటివి ప్రాచీన కళలని వాటిని ఆదరించటంతో పాటు భావి తరాలకు అందించేందుకు కళాకారులు కృషి చేయాలని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మణికొండ కళా బృందం గురువు వి.శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యం లో ఇటీవల చిలకలూరిపేట కళా నిలయంలో జరిగిన జాతీయ 40వ వార్షికోత్సవం నృత్య పోటీ లలో పాల్గొనే పలు బహుమతులను గెలుపొం దారు. దాంతో వారిని ఆయన గురువారం రాత్రి అభినందించారు. మహిషాసుర మర్దిని నృత్య నాటికకు ప్రథమ బహుమతి, బ్రహ్మాంజలి అనే నృ త్యానికి ద్వితీయ బహుమతి, ప్రహ్లాద పట్టాభిషే కానికి మూడవ పట్టాభిషేకానికి మూడవ బహుమ తి, ఇతర 10 జూరీ అవార్డులు లభించాయని శ్రీని వాస్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నృత్య పోటీలలో ప్రతిభ చూపిన కళాకారులను మాజీ చైర్మన్ అభినందించారు. నాయకులు బి.సాయి రెడ్డి, ఎస్.కిరణ్‌కుమార్, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు డాక్టరేట్‌లు



కె.వి.విశ్వనాథం



కామేశ్వర్‌రావు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.వి.కాశీవిశ్వనాథంకు జేఎన్‌టీయూ హైదరాబాద్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రాసెస్ పారామీటర్స్ ఇన్ టర్నింగ్ ఆఫ్ గ్లాస్ ఈ పాక్సి కాంపోజిట్ ఫీల్డ్ విత్ సిలికాన్ కార్బైడ్, అల్యూమినియం ఆక్సైడ్ అనే అంశంపై పరిశోధనను సమర్పించటంతో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఏసీఎస్ కుమార్, సీబీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డిల పర్యవేక్షణలో పరిశోధన చేసినట్టు ఆయన తెలిపారు. ఇదే ఎంజీఐ టీలో మెకానికల్ విభాగానికే చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.కామేశ్వర్‌రావుకు కాకినాడలోని జేఎన్ టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఎక్స్‌రిమెంట్, న్యూమరికల్ ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్‌క్సే సోలార్ పీవీ ప్యానెల్ యూజింగ్ సీసీఎం అనే అంశంపై పరిశోధన చేసినం దుకు డాక్టరేట్ వచ్చిందని ఆయన తెలిపారు. ఎంజీ ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశామని వివరించారు. డాక్టరేట్లు పొం దిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను శుక్రవారం కళా శాలలో ప్రిన్సిపల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, తోటి అధ్యాపకులు అభినందించారు.

సీసీ కెమెరాల ప్రారంభం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠ శాలలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ద్వారా కృషి చేస్తున్నదని మణికొండ మున్సి పాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... మణికొండ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు రూ. కోట్ల నిధు లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. దాం తో ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పి స్తున్నారన్నారు. ఉన్నత పాఠశాలలో రాబోయే విద్యా సంవత్సరానికి తరగతి గదుల కొరత తీరుతుంద న్నారు. నాయకులు ఎం.రాఘవరెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, బి.శ్రీరాములు, గంగాధర్, ప్రధానోపా ధ్యాయుడు దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ బచావో కమిటీలో రాచమల్ల సిద్దేశ్వర్

శంషాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్‌లో నూతనం గా ఏర్పాటు చేసిన కమిటీల్లో భాగంగా సంవిధాన్ బ చావో కమిటీలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ లతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలతో కూడిన 16 మందితో కమిటీ నియమించారు. ఇం దులో శంషాబాద్ మాజీ సర్పంచ్, రాజీవ్‌గాంధీ పం చాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఉత్త ర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో కమిటీ సభ్య లుగా నియమించడంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమా ర్‌గౌడ్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.